# 59. ఆత్మ ఒక్కటే

తన శిష్యులకి ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తున్న ఓ యోగి, ఓ రోజు ఆ శిష్యులందరిని పిలిచి చెప్పాడు.

"మీకు ఎవరిమీదయితే అత్యధిక ద్వేష భావం ఉందో వారి ఫొటోలని తీసుకురండి. మీకు ఆ భావాన్ని పోగొట్టే ప్రయత్నం చేస్తాను."

శిష్యులందరూ వెంటనే తాము ద్వేషించే వారి ఫొటోలని సేకరించి తెచ్చారు. తను సిద్ధం చేసిన అనేక టార్గెట్ బోర్డులని చూపించి యోగి వారితో చెప్పాడు.

"వీటి మీద మీ శత్రువుల ఫొటోలని అతికిస్తాను. మీరు ద్వేషించేవారి ఈ ఫొటోల మీదకి నేనిచ్చే డార్ట్‌లని విసరండి. వాళ్ళ మీద మీకు గల ద్వేషాన్ని పూర్తిగా ప్రదర్శించండి."

తన గయ్యాళి భార్య ఫొటోని ఒకరు, ఆస్తిని కాజేసిన తన సోదరుడి ఫొటోని మరొకరు, లంచం ముట్టనందుకు తన తల్లికి ఆపరేషన్ చేయక ఆవిడ మరణానికి కారణం అయిన డాక్టర్ ఫొటోని ఇంకొకరు... ఇలా అనేకమంది తాము ద్వేషించేవారి ఫొటోలని తెచ్చిస్తే, ఆ యోగి వాటిని ఒక్కో టార్గెట్ మీద అతికించాడు.

శిష్యులంతా తమ టార్గెట్‌ల ముందు నిలుచుని తమ శత్రువులైన వారి ఫొటోల మీదకి యోగి ఇచ్చిన డార్ట్‌లని ఆనందంగా నవ్వుతూ విసరసాగారు. సూదిగా ఉన్న ఒకో డార్ట్ వెళ్ళి ఒకో ఫొటోని గుచ్చుకోసాగాయి. కొన్ని కళ్ళల్లో, కొన్ని నుదుట, కొన్ని ముక్కు మీద, కొన్ని గడ్డం మీద...వారంతా కోపంతో కూడిన బలంతో విసిరిన ఆ డార్ట్స్ వల్ల ఆ ఫొటోలు చిరిగిపోయాయి.

వాళ్ళు విసరడం పూర్తయ్యాక ఆయన మౌనంగా ఒక్కో టార్గెట్ దగ్గరకి వెళ్ళి ఆ ఫొటోలని నెమ్మదిగా తీసేసాడు.

ఆశ్చర్యం!

ప్రతి ఫొటో అడుగున ఇంకో ఫొటో అతికించి ఉంది. అవన్నీ తాము ప్రేమించే బంధు, మిత్రుల ఫొటోలన్న సంగతి గ్రహించిన ఆ శిష్యులు, బాధతో కూడిన ఆశ్చర్యంతో, ఆ ఫొటోలకి గుచ్చుకున్న డార్ట్‌ల వల్ల కళ్ళు, ముక్కు, గడ్డంలాంటివి రూపాంతరం చెంది తమ శత్రువుల ఫొటోల్లా అసహ్యంగా కనిపిస్తున్న ఆ ఫొటోల వంక బాధగా చూడసాగారు.

అకస్మాత్తుగా ఆ గది నిండా నిశ్శబ్దం అలుముకుంది.

ఆ యోగి వాళ్ళతో మృదువుగా చెప్పాడు.

"మీకు చాలా కాలంగా నేను బోధిస్తున్న సత్యాన్ని మరోసారి చెప్తున్నాను వినండి. అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే. రూపాలే వేరు. మీరు ఆ భౌతిక రూపాలని చూస్తూ, వాటితో తాదాత్మ్యం చెందినంత కాలం ఆత్మ ఒక్కటే అన్న సత్యాన్ని గ్రహించలేరు. ఓ రూపంలోని ఆత్మని బాధిస్తే, అన్ని రూపాల్లోని అదే ఆత్మని బాధించిన వారవుతారు."

శిష్యులందరి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వారికీ విషయంలో ఇంకే బోధా అవసరం లేదని ఆ యోగి గ్రహించాడు. ఎందుకంటే వారి మనసుల్లోని ద్వేష భావం మటుమాయం అయింది.

## 60. దేవుడు ఎవరిని ప్రేమిస్తాడు?

అది కేరళలోని సముద్రం ఒడ్డున ఉన్న ఒక గ్రామం. అక్కడి చర్చ్‌కి కొత్తగా ఓ ఫాదర్ వచ్చాడు. చర్చ్‌కి వచ్చిన వారు ఆ ఫాదర్ మొదటి రోజు ఏం ప్రవచనం చెప్తాడా అని ఆసక్తిగా ఎదురుచూసారు. అజానుబాహువైన ఏభై ఏళ్ళ ఫాదర్‌ని ఆ గ్రామానికి చెందిన ఒకరు అందరికీ పరిచయం చేస్తూ, ఆయన తన బాల్య స్నేహితుడని చెప్పాడు. ఫాదర్ ప్రవచనాన్ని ప్రారంభించాడు.